క్లుప్తంగా

మంత్రి కాకాణి పరామర్శ



వెంకటాచలం : మండలంలోని గుడ్లూరువారి పాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఈపూరు మురళీధర్‌రెడ్డి తండ్రి అనంతపద్మనాభరెడ్డి ఈనెల 10వ తేదీన హైదరాబాద్‌లో అనారోగ్యంతో మృతి చెందాడు. స్వగ్రామానికి అనంతపద్మనాభరెడ్డి మృతదేహాన్ని ఆదివారం తీసుకురావడంతో, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గుడ్లూరువారిపాళెం చేరుకున్నారు. అనంతపద్మనాభరెడ్డి మృతదేహానికి పూలామాల వేసి నివాళులర్పించారు. మురళీధర్‌రెడ్డిని, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆర్థిక సాయం అందజేత



తోటపల్లిగూడూరు : తోటపల్లిగూడూరుకు చెందిన హేమకుమార్ ఇటీవల పక్షవాతానికి గురికాగా విద్యా ఫౌండేషన్ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం వారి ఇంట్లో అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి శ్రీపతి రాము మాట్లాడుతూ బాధితుడి కుమార్తె పదో తరగతి చదువుకు ఆర్థికంగా చేయూత అందిస్తామన్నారు. సంస్థ ప్రతినిధులు క్రిమన్, భవానీశంకర్, శాంతివర్ధన్, పవన్, డానియేల్, కెవిన్, జశ్వంత్, సందీప్, అఖిల్ పాల్గొన్నారు.

రాజన్న ఆశయాలు వైఎస్సార్‌సీపీతో సాకారం

• ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

మనుబోలు : పన్నెండేళ్ల క్రితం పురుడు పోసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనతికాలంలోనే దివంగత రాజన్న ఆశయాలను సాకారం చేసిందని ఆ పార్టీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన మనుబోలులో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కోదండరామపురంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. వైఎస్సార్ అమర్ రహే, జగన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం 13 కేజీల కేక్‌ను పార్టీ నేతలు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా హరగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేయడం వల్లే ఏపీలో వైఎస్సార్‌సీపీ 151 సీట్లతో ఘన విజయం సాధించి తిరుగులేని శక్తిగా మారిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, పార్టీ నాయకులు చిట్టమూరు అజయ్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, గిద్దంటి రమణయ్య, బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ముంగర రవీంధర్‌రెడ్డి, సూరపనేని కిశోర్‌నాయుడు, దాసరి భాస్కర్‌గౌడ్, దాసరి మహేంద్రవర్మ, దయాకర్, నవకోటి, పార్థేశ్వరరెడ్డి, చైతన్యరెడ్డి, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

• పొదలకూరు : పొదలకూరు పట్టణంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ బస్టాండ్‌లో పార్టీ మండల నాయకులు కోనం చినబ్రహ్మయ్య, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అలుపెరుగని పోరాటం చేసి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో నేతలు వాకాటి శ్రీనివాసులురెడ్డి, మద్దిరెడ్డి రమణారెడ్డి, శేఖర్‌బాబు, జి.లక్ష్మీకల్యాణి, సతీష్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గోపీ, శివప్రసాద్, ఖాదర్, దస్తగిరి, హరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కోవూరు : వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

• కోవూరు : మండల పరిధిలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. తొలుత పార్టీ నేతలు కోవూరు సాయిబాబా మందిరం సమీపంలో ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసమే వైఎస్సార్‌సీపీ నిరంతరం శ్రమిస్తోందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు కవరగిరి శ్రీలత, బొంధిలి సంఘ కార్పొరేషన్ చైర్మన్ కిశోర్‌సింగ్, మండల ఉపాధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి, పలు గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

• వెంకటాచలం : వైఎస్సార్‌సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వెంకటాచలంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మండల వెంకటశేషయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అడుగడుగునా అడ్డంకులు సృష్టించినా లెక్కచేయకుండా ధైర్యంతో పార్టీని ముందుకు నడిపి అధికారంలోకి తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీదే గెలుపు

ముత్తుకూరు : రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి విజయం సాధించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి ముఖ్యమంత్రి పదవి అధిష్టిస్తారని వైఎస్సార్‌సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ముత్తుకూరు పార్టీ కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధనరెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నడవడి ముత్యంగౌడ్ తదితరులు



ముత్తుకూరు : కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. సర్పంచ్ బూదూరు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు షేక్ నవీద్, నాయకులు కె.లక్ష్మణరెడ్డి, నెల్లూరు శివప్రసాద్, బైనా రామయ్య, సీపారెడ్డి రామ్మోహన్‌రెడ్డి, టి.రాజా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా..

తోటపల్లిగూడూరు : సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం మండలంలో ఘనంగా జరిగాయి. స్థానిక మండల కార్యాలయ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం ఎదుట పార్టీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మంచి పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, నెల్లూరు ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మన్నెం చిరంజీవులగౌడ్, స్థానిక నేతలు టి.తిరుపతి, ఎంబేటి సంధ్యారాణి, కె.మణి, పి.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు : కేక్ కట్ చేసి తినిపించుకుంటున్న నేతలు



వెంకటాచలంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నేతలు



పొదలకూరు పట్టణంలో..



మనుబోలు : పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



తోటపల్లిగూడూరు మండల కేంద్రంలో..

జనరంజకంగా వైఎస్ జగన్ పాలన



పొట్టెంపాడులో దివ్యాంగుడి సమస్యను ఆలకిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన జనరంజకంగా సాగుతోందని రాష్ట్ర వ్యవసాయ–మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ముత్తుకూరు మండలంలోని పొట్టెంపాడు గ్రామంలో ఆదివారం జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ తిరుగులేని శక్తిగా ఆవిర్భవించిందన్నారు. రాష్ట్రంలో కాసు బ్రహ్మానందరెడ్డి, ఎన్టీ రామారావు, చిరంజీవి తదితర ఎందరో నాయకులు ప్రాంతీయ పార్టీలు స్థాపించారని గుర్తుచేశారు. అయితే, ఎన్నికల్లో ఓటమి పాలై ఆయా పార్టీలు అదృశ్యమైపోయాయన్నారు. కానీ, ఎన్నికల్లో ఓటమిపాలైన కూడా ప్రతిపక్ష నాయకుడిగా సమస్యలపై పోరాటం చేసి, చంద్రబాబుతో ఢీకొన్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. సోనియాగాంధీ వంటి జాతీయ నాయకులను ఎదుర్కొని, ఎన్నో సవాళ్లను అధిగమించి ముఖ్యమంత్రి పీఠం అధిరోహించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు.

హామీలన్నీ నెరవేర్చాం

నాలుగేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని మంత్రి కాకాణి అన్నారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్న ఘనత కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని తెలిపారు. అభివృద్ధి–సంక్షేమ ఫలాలు సంపూర్ణంగా అందించామన్నారు. దీనివల్లే ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిపోయిన అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటామన్నారు. పొట్టెంపాడుకు వచ్చిన మంత్రి కాకాణికి మాజీ సర్పంచ్ పల్లంరెడ్డి జనార్ధనరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, నాయకులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, కట్టా సుబ్రహ్మణ్యం, షేక్.మస్తాన్, ఈపూరు కోటారెడ్డి, మునుకూరు జనార్ధనరెడ్డి, సన్నారెడ్డి బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గీతా ఆశ్రమంలో ఆరాధనోత్సవం

మనుబోలు : మండలంలోని మడమనూరు గ్రామంలో ఉన్న గీతా ఆశ్రమంలో ప్రణవానంద సరస్వతి ఆధ్వర్యంలో ఆదివారం ఆశ్రమ స్థాపకర్త సుబ్బమ్మ 15వ ఆరాధన మహోత్సవం జరిగింది. హోమాలు, పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ప్రవచన కార్యక్రమాన్ని జరిపారు. 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో గీతా మాత, మస్తానయ్య, వంశీకృష్ణారెడ్డి, లక్ష్మి, పార్థసారథి, మేఘన, భారతి, యోగా గురువు కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సర్వం సన్నద్ధం

• ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
• పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

కోవూరు : తూర్పు రాయలసీమ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను అధికారులు సర్వం సన్నద్ధం చేశారు. ఆదివారం నాటికే ఆయా పోలింగ్ కేంద్రాల వద్దకు సిబ్బంది చేరుకున్నారు. పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కోవూరు సీఐ కె.రామకృష్ణారెడ్డి, బుచ్చి సీఐ గంగపట్నం రామారావు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్ల కోసం 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుల ఓటర్ల కోసం ప్రతి మండలంలో ఒక కేంద్రం చొప్పున ఏర్పాటు చేశారు. పట్టభద్రులకు సంబంధించి కోవూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలు, బుచ్చిరెడ్డిపాళెంలో నాలుగు కేంద్రాలు, ఇందుకూరుపేట, విడవలూరు, కొడవలూరు మండలాల్లో రెండేసి కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పట్టభద్రులు– 1,526: ఉపాధ్యాయులు– 60

కొడవలూరు : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కొడవలూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అధికారులు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 11 మంది సిబ్బందిని నియమించగా, వారు ఆదివారమే కేంద్రానికి చేరుకున్నారు. ఎస్సై సుబ్బారావు ఆధ్వర్యంలో 25 మంది సిబ్బందిని పోలింగ్ కోసం నియమించారు. వీరంతా ఆదివారమే విధుల్లోకి వచ్చి బందోబస్తు నిర్వహిస్తున్నారు. మండలంలో 1,526 మంది పట్టభద్రుల ఓటర్లుండగా, 60 మంది ఉపాధ్యాయ ఓటర్లున్నారు. తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం పోలింగ్ కేంద్రం వద్దే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి ఓటరు స్వేచ్ఛగా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై జి.సుబ్బారావు పేర్కొన్నారు.

పట్టభద్రులు– 3,814: ఉపాధ్యాయులు– 388

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్ఎన్ఆర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తిచేశారు. మండలంలో 3,814 మంది పట్టభద్రులు, 388 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ పద్మజ తెలిపారు. ఎంపీడీఓ నరసింహారావు, ఎస్సై వీరప్రతాప్‌లతో కలిసి తహసీల్దార్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

పట్టభద్రులు– 2,610: ఉపాధ్యాయులు– 166

పొదలకూరు : పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రం పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మొత్తం నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్ ఆదివారం వెల్లడించారు. సోమవారం ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నట్లు తెలిపారు. 155, 156, 156ఏ మూడు పోలింగ్ కేంద్రాలు పట్టభద్ర ఓటర్ల కోసం ఏర్పాటు చేశామన్నారు. పట్టభద్రుల ఓటర్లు మండలంలో 2,610 ఉన్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ ఓటర్ల కోసం 84వ నంబర్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఉపాధ్యాయ ఓటర్లు 166 ఉన్నట్లు వెల్లడించారు. ఎన్నికలను అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ఓటర్లు గుర్తింపు కార్డును తీసుకురావాల్సిందిగా సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.



బుచ్చిరెడ్డిపాళెం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పట్టభద్రులు– 1,540: ఉపాధ్యాయులు– 91

వెంకటాచలం : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వెంకటాచలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ కృష్ణ ఆదివారం పరిశీలించారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వెంకటాచలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తహసీల్దార్ తెలిపారు. మండలంలో 1,540 మంది పట్టభద్రులు ఓటు హక్కు కలిగి ఉన్నారని, అలాగే 91 మంది ఉపాధ్యాయ ఓటు హక్కు కలిగి ఉన్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల్లోపు ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు.

పట్టభద్రులు– 1,501: ఉపాధ్యాయులు– 68

ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రెండు పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయులకు సంబంధించి ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాగా మండలంలో 1,501 మంది పట్టభద్రులు, 68 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తహసీల్దార్ సుబ్బయ్య తెలిపారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు.



కోవూరు : పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు



కొడవలూరులోని పోలింగ్ కేంద్రంలో సిబ్బంది



బుచ్చిరెడ్డిపాళెం : డీఎల్ఎన్ఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం



కోవూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పూర్తయిన ఏర్పాట్లు



వెంకటాచలం : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణ, అధికారులు



ఇందుకూరుపేట : కొత్తూరులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

వరికోతలు ఆరంభం

• పెరిగిన ధాన్యం దిగుబడి
• ధాన్యానికి గిట్టుబాటు ధరలు

పొదలకూరు : మండల పరిధిలో వరికోతలు ప్రారంభం అయ్యాయి. నెలాఖరుకు 70 శాతం కోతలు పూర్తయ్యే అవకాశం ఉంది. మరో వారం రోజుల్లో రైతులు కోతల పనులతో తీరిక లేకుండా ఉండబోతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించే ధాన్యానికి గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. బయటి మార్కెట్లోనే ధాన్యానికి ధరలు లభిస్తుండడంతో ప్రస్తుతం రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 14 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఇందులో 40 శాతం ఆర్అండ్ఆర్ 15048(తెలంగాణ మసూరీ), 30 శాతం తెలంగాణ మసూరా, 20 శాతం బీపీటీ 5204, 10 శాతం ఎంటీయూ 1262, 10 శాతం కేఎన్ఎం 1638, 20 శాతం ఎన్ఎల్ఆర్ 34449 రకం వరిసాగు చేశారు. ఈ రబీలో ఎక్కడా సాగునీటి ఇబ్బందులు తలెత్తకపోవడంతో పంటలు బాగా పండాయి. ఎకరానికి 3 నుంచి 4 పుట్ల వరకు ధాన్యం దిగుబడి అవుతున్నట్లు రైతులు తెలిపారు. ముందుగా నాట్లు వేసిన రైతులు ఫిబ్రవరి ఆఖరు నుంచే కోతల పనులు ప్రారంభించారు. అయితే ఏప్రిల్‌లో కూడా కోతలు చేపట్టే అవకాశం ఉంది. కోతల కోసం తమిళనాడు నుంచి వరికోత యంత్రాలు అధిక సంఖ్యలో తీసుకొచ్చే అవకాశం ఉంది.



కళ్లాల్లోనే తూకం వేస్తున్న ధాన్యం

గిట్టుబాటు కోసం..

రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు మండలంలో ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో సూరాయపాళెం, విరువూరు, తాటిపర్తి, నేదురుమల్లి, మహ్మదాపురం, నావూరు ఆర్బీకేల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అయితే మిల్లర్లే ప్రస్తుతం రైతులకు గిట్టుబాటు ధరను కల్పించి కొనుగోలు చేస్తున్నారు. అధిక శాతం పండించిన తెలంగాణ మసూరీ రకాన్ని పుట్టి రూ.20 వేలకు కొనగోలు చేస్తున్నారు. అయితే నాలుగు రోజులుగా తెలంగాణ మసూరీకి రూ.వెయ్యి ధర తగ్గింది. అయినప్పటికీ గిట్టుబాటు ధర లభిస్తున్నట్లు రైతులు తెలిపారు. ఎన్ఆర్ఆర్ 34449 నెల్లూరు మసూరీ రకాన్ని రూ.14,500 వంతున కొనుగోలు చేస్తున్నారు. గతేడాది ఇదే రకం ధాన్యాన్ని దళారులు రూ.11 వేలకు కొనుగోలు చేశారు.



కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట



కోత పనులకు తరలి వెళుతున్న యంత్రాలు

ధరలు తగ్గితే ఫిర్యాదు చేయాలి



మిల్లర్లు లేదా దళారులు ధాన్యం ధరలు ఒక్కసారిగా తగ్గించి కొనుగోలు చేస్తే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలి. ప్రస్తుతం బయటి మార్కెట్లోనే రైతుకు ఆశించిన స్థాయిల కంటే అదనంగా గిట్టుబాటు ధర లభిస్తోంది. ఫలితంగా ఆర్బీకేలకు ధాన్యాన్ని తీసుకు రాకుండా కళ్లాల్లోనే అమ్ముకుంటున్నారు.

– ఎ.వాసు, ఏఓ, పొదలకూరు.

వివాహిత ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): వివాహితను వరకట్నం కోసం చిత్రహింసలకు గురిచేసి ఆమె మరణానికి కారణమైన భర్త, అత్త, మరిదిని నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాలు..దొంతలి గ్రామానికి చెందిన మేఘన(20) నక్కాగోపాల్‌నగర్‌కు చెందిన జిమ్‌ట్రైనర్ ఏకొల్లు కుమార్ అలియాస్ దేవకుమార్ 2021 మేలో ప్రేమ వివాహం చేసుకున్నారు. 8 నెలల క్రితం మేఘన ఓ పాపకు జన్మనిచ్చింది. అప్పట్నుంచి భర్త, అత్త రాధప్రియ, మరిది జీవన్‌సాగర్ అలియాస్ చింటూ ఆమెను వరకట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధించసాగారు. మేఘన తల్లి రూ.30వేలు నగదు, మూడు సవర్ల బంగారు ఆభరణాలు ఇచ్చినా వారు మరింత నగదు, నగలు కావాలని ఒత్తిడి తెచ్చారు. ఆమెను సూటిపోటి మాటలతో వేధించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 4న అర్ధరాత్రి దాటిన తర్వాత మేఘన ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి కేసు విచారణ చేపట్టి మేఘన భర్తతో పాటు అత్త, మరిదిని అరెస్ట్ చేశారు.

కళాకారుడు రమణకు డాక్టరేట్

నెల్లూరు(అర్బన్): నెల్లూరు చెందిన కళాకారుడు స్టెప్అప్ రమణ మలేషియాకు చెందిన సెయింట్ మదర్ థెరిస్సా వర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. రమణ స్టేజ్ డాన్సర్ నుంచి స్టెప్అప్ ఈవెంట్స్ పేరుతో అంచెలంచెలుగా ఎదిగి మూడు, నాలుగు రాష్ట్రాల్లో భారీ ఈవెంట్స్ చేస్తూ కళామతల్లి ముద్దుబిడ్డగా ఎదిగాడు. ఆయన కరోనా సమయంలో శివాజీ యూత్ ఫౌండేషన్‌తో కలిసి వందలాది కుటుంబాలకు సాయం అందించారు. ఈ నేపథ్యంలో రమణ సేవలను గుర్తించి కౌలలాంపూర్‌లోని ఓ హోటల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో వర్సిటీ అధ్యక్షుడు డాక్టర్ బాలమురుగన్ చేతుల మీదుగా డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.
ఈ సందర్భంగా నేలకుర్తి రమణ మాట్లాడుతూ డాక్టరేట్ తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. కళారంగంతో పాటు సేవారంగంలోనూ తన వంతు పాత్రపోషిస్తానన్నారు. తనకు డాక్టరేట్ రావడానికి సహకరించిన బెంగళూరుకు చెందిన మదర్ థెరిస్సా వర్సిటీ వీసీ డాక్టర్ విజయసరస్వతి, శివాజీ యూత్ ఫౌండేషన్ చైర్మన్ మోపూరు భాస్కర్‌నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు.